సాక్షి కామారెడ్డి

బుధవారం । 5 । జూలై । 2023



చర్యలు తీసుకోవాలి

మండల సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు.

- 9లో ▸



న్యాయం చేయండి

గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /24.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'జీపీఎఫ్' బదిలీ షురూ..



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జీపీఎఫ్ ఖాతాల బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. పక్షం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని జెడ్పీ సీఈవో సాయా గౌడ్ తెలిపారు. 2016 అక్టోబర్ 11న కామారెడ్డి జిల్లా ఏర్పాటయ్యింది. అయినా ఉపాధ్యాయులు, జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీరాజ్ ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ ఖాతాలు నిజామాబాద్ జెడ్పీలోనే జమ చేస్తున్నారు. జీపీఎఫ్ సక్రంగా జమ కావడం లేదని, అంతా గందరగోళంగా ఉందని ఉద్యోగ, ఉపాధ్యాయులు పలుమార్లు ఆందోళనలు చేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి, నూతన జిల్లాలకు సంబంధించిన ఖాతాలను ఆయా జిల్లాలలోనే నిర్వహించాలని ఆదేశించింది. ఈ విషయమై జెడ్పీ సీఈవో సాయా గౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్‌రెడ్డి, కుశాల్ మంగళవారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు.

'హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోండి'

కామారెడ్డి టౌన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్‌లను బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్ల కోసం www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో తాత్కాలిక పద్ధతిలో బోధించడానికి ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలికల గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని పాఠశాల విభాగానికి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, బయో సైన్స్, సోషల్, పీఈటీ, కళాశాల విభాగంలో తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బాలుర పాఠశాలల్లో గణితం, సాంఘిక శాస్త్రం, పీఈటీ పార్ట్‌టైం ఉపాధ్యాయులుగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. బాలికల పాఠశాలల్లో పనిచేయడానికి మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పీజీ, బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, టెట్ అర్హత సాధించిన వారు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామారెడ్డిలో పట్టణంలోని సరంపల్లి, నాగిరెడ్డిపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.



భవన నిర్మాణ రంగంలో సంక్షోభం నెలకొంది. ఓవైపు ప్లాట్లు.. మరోవైపు ముడిసరుకుల ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో ఇళ్ల ధరలూ ఆకాశాన్నంటాయి. ఇంకోవైపు పిల్లల చదువులు, పెరిగిన నిత్యవసర ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో సామాన్యుడు సొంతింటి కల నెరవేర్చుకోలేకపోతున్నాడు. దీంతో రెడీమేడ్ ఇళ్లు అమ్ముడుపోక బిల్డర్లు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

కొనే వారేరి..

- నిర్మాణ రంగంలో సంక్షోభం
- అమ్ముడుపోని రెడీమేడ్ ఇళ్లు
- పెట్టుబడులు పెట్టి అప్పులపాలవుతున్న బిల్డర్లు

సాక్షి, కామారెడ్డి: జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో ఏటా వందలాది రెడీమేడ్ ఇళ్లు నిర్మిస్తుంటారు. గతంలో నిర్మాణంలో ఉండగానే అమ్ముడుపోయేవి. కరోనా తర్వాత పరిస్థితి మారిపోయింది. రెండు, మూడేళ్లుగా ఇళ్ల అమ్మకాలు తగ్గిపోయాయి. కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్, శ్రీనివాసనగర్, స్నేహపురి కాలనీ, కాకతీయనగర్, సైలానీబాబా కాలనీ, జయశంకర్ కాలనీ, భవానీనగర్, కల్కినగర్, మధురానగర్, దేవీ విహార్ తదితర ప్రాంతాల్లో అమ్ముడుపోని ఇళ్లు నాలుగు వందలకు పైగా ఉన్నాయని తెలుస్తోంది. ఇళ్లు కొనేవారు లేకపోవడంతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన బిల్డర్లు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నారు.

ప్లాట్ల ధరలు ఆకాశంలో...

కామారెడ్డి పట్టణంతో పాటు పట్టణ శివారు కాలనీలు, అనుబంధ గ్రామాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. జిల్లా ఏర్పడకముందే ఇక్కడ ధరలు భారీగా పెరిగాయి. జిల్లా ఏర్పాటయ్యాక మరింత పెంచేశారు. కాలనీలలో ఇళ్ల మధ్యలో ప్లాటు చదరపు గజానికి రూ. 20 వేల నుంచి రూ. 30 వేలు పలుకుతోంది. నూరు గజాలో, నూటా యాభై గజాల ప్లాటో కావాలంటే రూ. 20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ప్లాటు కొని ఇల్లు నిర్మించుకోవాలంటేనే జనం వణుకుతున్నారు. పట్టణానికి దూరంగా వెళ్తే గజానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతుంది. తూర్పు, ఉత్తరం దిశలకు సంబంధించిన ప్లాట్ల ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి.

నాలుగు వందలకుపైనే..

జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీలలో నిర్మించిన రెడీమేడ్ ఇళ్లలో దాదాపు 400 వరకు అమ్ముడుపోవడం లేదని తెలిసింది. ఒక్కో ఇంటి నిర్మాణంతో బిల్డర్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లాభం వచ్చేది. అయితే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తయ్యే వరకు ఏడాది కాలం పడుతోంది. ఇళ్ల నిర్మాణం సమయంలో అమ్ముకుంటే పెట్టుబడికి డబ్బులు ముందే తీసుకుని పనులు పూర్తి చేస్తుంటారు. అయితే పనులు కొనసాగుతున్నపుడు కొనుగోళ్లు మందగించడం, పనులు పూర్తయిన తర్వాత కూడా కొనడానికి ముందుకు రాకపోవడంతో నెలల తరబడిగా పెట్టుబడిపై వడ్డీలు పెరుగుతున్నాయి. లాభాలేమో గానీ ఉల్టా నష్టాలు వస్తున్నాయని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ రంగంలో నెలకొన్న సంక్షోభం ఇప్పట్లో ముగిసేట్టు కనిపించడం లేదని పేర్కొంటున్నారు.

పెరిగిన నిర్మాణ వ్యయం

కరోనా తర్వాత నిర్మాణ రంగానికి అవసరమైన ముడిసరుకుల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. స్టీల్, సిమెంట్, ఇసుక ధరలతో పాటు ప్లంబింగ్, ఎలక్ట్రికల్, కలర్స్, పీవోపీ, టైల్స్, మార్బుల్, గ్రానైట్ ధరలు భారీగా పెరిగాయి. మేస్త్రీలతోపాటు ఆయా పనులు చేసే కార్మికుల కూలీలు కూడా దాదాపు రెట్టింపయ్యాయి. ఓవైపు ప్లాట్ల ధరలు, మరోవైపు నిర్మాణ వ్యయం పెరగడంతో ఇళ్ల ధరలను పెంచాల్సి వస్తోంది. వంద గజాలు, వంద పది గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఇల్లు గతంలో రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలలోపు వచ్చేది. ప్రస్తుతం వాటి ధర రూ. 45 లక్షలు దాటింది. ఏరియా, దిశను బట్టి ధరల్లో మార్పులుంటున్నాయి. ఇళ్ల ధరలు భారీగా పెరగడంతో కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపడం లేదు. దీంతో అమ్మకాలు పడిపోయాయి.

శోభాయాత్రను ప్రారంభిస్తున్న స్పీకర్



వైభవంగా శోభాయాత్ర

బాన్సువాడ: బాన్సువాడలో మంగళవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి యాత్రను ప్రారంభించారు. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర అంబేద్కర్ చౌరస్తా, పాత బాన్సువాడ, చైతన్య కాలనీ, బోధన్‌రోడ్డు, డెయిలీమార్కెట్, తాడ్కోల్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా పెద్ద హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. శోభాయాత్రలో మహిళలు కోలాటం ఆడారు. దారి పొడవునా ముగ్గులు వేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు గురువినయ్, శ్రీమాన్ వెంకటదాస్ తదితరులు పాల్గొన్నారు.

'కొండపోచమ్మ' నీళ్లిస్తామన్నారు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: వానాకాలం పంటల సాగు కోసం నిజాంసాగర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీలు ఉన్నాయని, అవసరమైతే మరో 5 టీఎంసీల నీళ్లు కొండపోచమ్మ ద్వారా ఇస్తామని సీఎం చెప్పారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నెలరోజులు తిరిగినా చుక్క నీళ్ల వచ్చేవి కావని, ఇప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని పాత బాన్సువాడకు వెళ్లేదారిలో రూ.1.05 కోట్లతో నిర్మించిన వ్యవసాయశాఖ సహాయ అధికారి కార్యాలయం, వ్యవసాయ శాఖ దుకాణ సముదాయం, రైతు సమన్వయ సమితి కార్యాలయాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్ రూ. 4 వేలకు పెంచుతామని హామీ ఇస్తున్నారని, ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రూ. 4వేల పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ నాయకులు నాటకాలాడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ, అంతర్జాతీయ విత్తన పరీక్ష సంస్థ అధ్యక్షుడు కేశవులు, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపీపీ నీరజా వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రామస్వామి, ఏవో కమల, ఏఈవో రాణి, నాయకులు ద్రోణవల్లి అశోక్, రఘు, మోహన్‌నాయక్, శ్రీధర్, పాత బాలకృష్ణ, గురువినయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

'కార్యకర్తలే పార్టీకి బలం'



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కార్యకర్తలే బీజేపీకి బలమని ఆ పార్టీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ తీశారు. జిల్లాకేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడానికి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

15లోగా హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: శాఖల వారీగా ఇచ్చిన హరితహారం లక్ష్యాలను 15వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హరితహారం లక్ష్యాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని మండలాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు లేని మండలాల్లో అటవీ భూముల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఖాళీ స్థలం ఉంటే కరివేపాకు, ఉసిరి, చింత, మునగ, వెలగ వంటి మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడానికి వివిధ శాఖల అధికారులు పోటీపడాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎఫ్‌వో నిఖిత, డీఆర్డీవో సాయన్న, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు శివరాం, సిద్ధిరాములు, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

డిజిటల్ యుగం..



ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. పెద్దపెద్ద షాప్‌లలోనే కాదు.. రోడ్డు పక్కన దుకాణాలు నిర్వహించేవారు, కూరగాయలు విక్రయించేవారూ పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. పిల్లలు ఆడుకునే పీకలు, గాలి మరలను అమ్ముతున్న వ్యక్తి కూడా డిజిటల్ పేమెంట్ బాటలో నడుస్తున్నాడు. కామారెడ్డి పట్టణంలో ఓ వ్యక్తి ఫోన్ పే క్యూఆర్ కోడ్ ఉన్న కార్డు అందరికీ కనిపించేలా కర్రకు తగిలించుకుని ఆయా వస్తువులను విక్రయిస్తున్నాడు. నగదు లేనివారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు పంపిస్తున్నారని చెప్పాడు. – సాక్షి, కామారెడ్డి

బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పి, కేసీఆర్‌ను గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.5 లక్షల కోట్ల అప్పులో 30 శాతం కమిషన్లు రెండు పార్టీలు వాటాలు పంచుకున్నాయన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే రూ. 5 లక్షల కోట్ల అప్పు, చేసిన ఖర్చులు, పనుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. త్వరలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి భారీగా నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్నారు. రాష్ట్రంలో పంపిణీ చేసిన పోడు పట్టాలలో 50 శాతం బీఆర్‌ఎస్ నాయకుల బంధువులకే వచ్చాయన్నారు. కామారెడ్డిలో 8 వేల దరఖాస్తులు వస్తే 1,600 మాత్రమే ఇచ్చారన్నారు.

మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడు..

కామారెడ్డిలో అధికార పార్టీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మోనార్క్‌లా వ్యవహరిస్తూ అధికారులు, నాయకులపై దురుసుగా వ్యవహరిస్తున్నాడని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యతపై తాను చేసిన సవాల్‌ను స్వీకరించకుండా ప్రభుత్వ విప్ పారిపోయాడన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, అమ్ముల ముకుందం, కారంగుల అశోక్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, భీమ్‌రెడ్డి, గణేష్ నాయక్, యాదవరెడ్డి, శివ కృష్ణమూర్తి, గౌనె శ్రీనివాస్, పండ్ల రాజు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో 'అరి' విడుదల చేస్తాం



కుమారుడికి అన్నప్రాశన చేయిస్తున్న డైరెక్టర్ జయశంకర్ దంపతులు

తాడ్వాయి: అరి (మై నేం ఈజ్ నోబడి) అనే చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేస్తామని సినిమా డైరెక్టర్ జయశంకర్ తెలిపారు. ఆయన మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి తాడ్వాయిలోని శబరి మాత ఆశ్రమాన్ని దర్శించుకున్నారు. తన కుమారుడికి అన్నప్రాశన చేయించారు. అనంతరం సినిమాకు సంబంధించిన మొదటి కాపీని శబరి మాత వద్ద ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం నేను డైరెక్టర్‌గా చేసిన మొట్టమొదటి సినిమా పేపర్‌బాయ్‌ను ప్రేక్షకులు ఆదరించారన్నారు. హీరోయిన్ కాజల్‌తో థ్రిల్లర్ సినిమాను తీయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. అరి చిత్రంలోని పలు సన్నివేశాలను శబరి మాత ఆశ్రమంలో చిత్రీకరించామన్నారు. ఈ చిత్రం కూడా ప్రేక్షకులను అలరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఏబీవీపీ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ డిమాండ్ చేశారు. పరిషత్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లి ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తాండవం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎంఈవో, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ, నగర కార్యదర్శి చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోహిత్, నాయకులు సంజయ్, ఖలీల్, శ్రీరామ్, సమీర్, ప్రణీత్, సాయి చరణ్, రాజు, సంతోష్, విక్రమ్, ఆదిత్య, మారుతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

క్లుప్తంగా

నేడు బషీరాబాద్‌లో స్పోర్ట్స్‌స్కూల్ సెలక్షన్స్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ హైస్కూలులో బుధవారం స్పోర్ట్స్‌స్కూల్ ప్రవేశాల కోసం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆంధ్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను వారి హెచ్‌ఎంలు ఉదయం 9.30 గంటలకు బషీరాబాద్‌కు తీసుకొని రావాలన్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి(డిచ్‌పల్లి): తెయూ విద్యార్థినిని బెదిరించిన సంతోష్, శివ, నవీన్‌పై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ నేత కర్క గణేష్, ఎస్‌ఎఫ్‌ఐ నేత ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులపై దాడులు చేసే సంస్కృతి తరచుగా జరుగుతుందన్నారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అషూర్, వెంకటేష్, నాయకు లు చిత్రు, దినేష్ ఉన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన తెయూ సిబ్బంది



ఖలీల్‌వాడి(డిచ్‌పల్లి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్కా లింబాద్రిని హైదరాబాద్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది వినోద్, సాయగౌడ్, అసిస్టెంట్ రిజిస్టర్ భాస్కర్, సూపరింటెండెంట్ నరేందర్ ఉన్నారు.

శ్రీచైతన్య పాఠశాలకు నోటీసులు జారీ

నిజామాబాద్ అర్బన్: నగరంలో వినాయక్‌నగర్‌లో శ్రీ చైతన్య పాఠశాలకు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగడంపై పలు విద్యార్థి సంఘాలు డీఈవోకు ఫిర్యాదు చేశాయి. దీంతో స్పందించిన డీఈవో విచారణ చేసి.. పాఠశాలకు అనుమతి లేనందున 8, 9, 10 తరగతులు నిర్వహించవద్దని ఆ తరగతుల్లో ఉన్న విద్యార్థులను గుర్తింపు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

హెచ్‌పీఎస్ పాఠశాలకు నోటీసులు

నగరంలో హెచ్‌పీఎస్ పాఠశాలకు ఎంఈవో రామారావు మంగళవారం నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయాలు చేస్తున్నారని పలు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేసినందున నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

ప్రాంగణాలు సరే.. క్రీడలేవి?

- ఇప్పటికీ రాని క్రీడా పరికరాలు
- నిరుపయోగంగా మారిన వైనం



పోచంపాడ్‌లో నిర్మించిన క్రీడా ప్రాంగణం..



క్రీడా పరికరాలు లేక వెలవెలబోతున్న ప్రాంగణం

బాల్కొండ: గ్రామీణస్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలని ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ఊరికో క్రీడా ప్రాంగాణాన్ని నిర్మించింది. కానీ ఆ క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు నిర్వహించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరగడంతో వెలవెలబోతున్నాయి. సంబంధిత అధికారులు క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్న ఇప్పటి వరకు క్రీడా పరికరాలు తీసుకురాలేదు. క్రీడా పరికరాలను డీఆర్‌డీఏ ద్వారా సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఏ శాఖ ద్వారా సమకూర్చలేదు.

ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు..

బాల్కొండ మండలంలో 10 గ్రామాల్లో, ముప్కాల్ మండలంలో ఏడు గ్రామాల్లో, మెండోరా మండలంలో 10 గ్రామాల్లో క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేశారు. కానీ ఏ ఒక్క క్రీడా ప్రాంగణంలో పరికరాలను ఏర్పాటు చేయాలేదు. క్రీడా పరికరాలు లేక క్రీడా ప్రాంగాణాలు చిన్నబోతున్నాయి. కనీసం పరికరాలు లేకుండ చేసే యోగా, నడక, రన్నింగ్ లాంటివి చేసుకోవడానికి అనువుగా లేకుండ క్రీడా ప్రాంగణాలు తయారయ్యాయి. ప్రాంగణాలు నిరుపయోగంగా మారడంతో పిచ్చి మొక్కలతో నిండి పోయాయి. వాటిని చూస్తే క్రీడా ప్రాంగాణాలనే అనే అనుమానం కలిగేల తయారయ్యాయి.

టార్గెట్ కోసమేనా?

పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టాల్సిన పనులు, టార్గెట్‌లో భాగంగా క్రీడా ప్రాంగాణాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేశారు. టార్గెట్ కోసం తంటాలు పడ్డారు. కానీ ఎలాంటి ఉపయోగం లేని క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల ప్రహరీ వద్దనే తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం అంటూ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అంతే ఇప్పటి వరకు మైదానం ఏర్పాటు చేసింది లేదు. ఆటలు ఆడింది లేదు. దీంతో పల్లెల్లో పేరుకే గ్రామీణ క్రీడా ప్రాంగాణాలుగా మిగిలిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రీడా పరికరాలను సరఫరా చేయాలని, ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

సామగ్రి వచ్చింది..

క్రీడా ప్రాంగణాల్లో కావాల్సిన క్రీడా సామగ్రి వచ్చింది. కొన్ని గ్రామా పంచాయతీల పరిధిలోని ప్రాంగణాల్లో బిగించాల్సి ఉంది. త్వరలో క్రీడా ప్రాంగణాల్లో పరికరాలు బిగించి క్రీడాకారులు క్రీడలు ఆడేలా ఏర్పాట్లు చేస్తాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, మెండోరా

ఎస్‌ఎస్‌ఆర్‌లో కొత్త కోర్సులు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎస్‌ఎస్‌ఆర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి మూడు కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటెక్(సీఎస్‌సీ) ప్రత్యామ్నాయంగా నాలుగు సంవత్సరాల బీఎస్సీ(హానర్ ఇన్ సీఎస్) ప్రారంభించామని, ఈ విద్యను పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ (సీఎస్‌ఈ)తో సరిసమానంగా ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అలాగే బీబీఏ(రిటైల్ ఆపరేషన్స్), బీబీఏ (హెల్త్ కేర్ మేనేజ్మెంట్) కోర్సుకు ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు చేరవచ్చన్నారు. బీబీఏ(రిటైల్ ఆపరేషన్)లో చేరిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానంలో వారంలో మూడు రోజులు చదువు, మూడు రోజులు కొలువు చేసుకుంటూ నెలకు రూ.10వేల వరకు స్టైఫండ్ పొందే అవకాశం ఉందన్నారు. రూ.20వేల వేతనంతో ప్లేస్‌మెంట్ గ్యారంటీ ఉంటుందన్నారు. అలాగే బీబీఏ (హెల్త్ కేర్ మేనేజ్మెంట్)కోర్సులో చేరిన విద్యార్థులకు కార్పొరేట్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిందితురాలిని తప్పించేందుకే అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న సీఐ తిరుపయ్య

రాజంపేట: భూ తగాద విషయంలో నిందితురాలైన నాయిని జ్యోతిని కేసు నుంచి తప్పించడానికే ముదాం సాగర్ కుటుంబ సభ్యులు కావాలనే పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని భిక్‌నూర్ సీఐ తిరుపయ్య అన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. గత నెల 30న భూ తగాద విషయంలో నాయిని జ్యోతి, ఆమె కుటుంబ సభ్యులు, ఇతర వ్యక్తులతో కలిసి నాయిని శ్రీనివాస్‌పై కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. నాయిని శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన సంబంధిత 10 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాము. జ్యోతిని బంధువైన ముదాం సాగర్ పూచీకత్తుపై తీసుకెళ్లాడు. మరుసటిరోజు నాయిని జ్యోతిని తీసుకురాకపోవడంతో సోమవారం ముదాం సాగర్‌న్ పలిచి నాయిని జ్యోతి ఆచూకీ విషయంపై ఆరా తీస్తుండగా మూర్ఛ రావడంతో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారన్నారు. కానీ ముదాం సాగర్‌పై పోలీసులు కావాలనే దాడి చేశారని అతడి కుటుంబ సభ్యులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు. సాగర్‌పై ఇదివరకు కామారెడ్డి పరిధిలో మూడు కేసులు ఉన్నాయన్నారు. జ్యోతిని కావాలనే కేసు నుంచి తప్పించేందుకు కుట్రపన్నుతున్నారని గుర్తించినట్లు సీఐ తెలిపారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు ఇప్పించండి



ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు సమస్యలను విన్నవిస్తున్న చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ సహకార చక్కెర కర్మాగార కార్మికులకు 62 నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇప్పించాలని ఫ్యాక్టరీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు హైదరాబాద్‌లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. సర్వీస్‌లో ఉన్న పర్మినెంట్ ఉద్యోగులను, సీజనల్, ఎన్‌ఎంఆర్ కార్మికులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏవిధంగానైతే 6 సహకార చక్కెర కర్మాగారాలకు వీఆర్‌ఎస్ ఇచ్చారో అదేవిధంగా ఉద్యోగులకు వీఆర్‌ఎస్ అమలుపరిచి, కార్మికులకు ఎన్‌ఎస్‌ఎఫ్ బోధన్ ఫ్యాక్టరీలో వీఆర్‌ఎస్ ఇచ్చిన క్రమంలో వారివారి క్వార్టర్లను నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. బాజిరెడ్డి మాట్లాడుతూ.. బుధవారం మంత్రి కేటీఆర్‌తో మాట్లాడించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

‘బిల్లులు లేకుండానే నిధులు డ్రా’

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంపీపీ భర్త బాలరాజ్‌గౌడ్, ఎంపీడీవో నారాయణ ప్రభుత్వ నిధులను బిల్లులు లేకుండానే డ్రా చేస్తూ, దుర్వినియోగం చేశారని వైస్ ఎంపీపీ నర్సింలు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎంపీడీవో నారాయణ విధులకు హాజరు కాకుండా వారం రోజుల తర్వాత వచ్చి సంతకాలు చేస్తున్నారని అదేవిధంగా ఎంపీడీవో షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు జనరల్ ఫండ్ నుంచి ఇష్టారాజ్యంగా నిధులను డ్రా చేసి, ఎంపీపీ భర్త బాలరాజ్‌గౌడ్‌కు ఇస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్‌లో రూ.74,800, మేలో రూ.1,59,221, జూన్‌లో రూ.48,100ను ఎలాంటి బిల్లులు లేకుండానే బాలరాజ్‌గౌడ్‌కు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశం కోరం లేకుండా ఎలా నిర్వహిస్తారని అన్నారు. డబ్బులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈవిషయమై ఎంపీడీవో నారాయణను వివరణ కోరగా ఎంపీడీవో కార్యాలయానికి సంబందించి ఎలాంటి నిధులను దుర్వినియోగం చేయలేదని, వైస్ ఎంపీపీ చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు.

మాకు న్యాయం చేయండి



గల్ఫ్ ఏజెంట్ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): విజిట్ వీసాపై గల్ఫ్ దేశానికి పంపి, తమ ఇంటి పెద్ద దిక్కు మరణానికి కారణమైన ఏజెంట్ నర్సింలు తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఏజెంట్ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. ఐదు నెలల క్రితం ఉప్పలవాయి గ్రామానికి చెందిన పురం సిద్ధరాములును మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన కరణం నర్సింలు రూ. లక్ష తీసుకొని విజిట్ వీసాపై మస్కట్ దేశానికి పంపించాడు. సరైన ఉపాధి లభించక సిద్ధరాములు రోడ్డుపై పడ్డాడు. దీంతో తినడానికి తిండి లేక అనారోగ్యం పాలై గత 20 రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహం ఇప్పటికీ ఇంటికి రాలేదు. తనకు ముగ్గురు కూతుర్లు ఉన్నారని, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి అప్పుల పాలై ఉన్నానని, తనకు న్యాయం చేయాలని మృతుడి భార్య డిమాండ్ చేసింది. గల్ఫ్ ఏజెంట్ కరణం నర్సింలు ఇంటికి తాళం వేయడంతో, బాధితులు నర్సింలును ఫోన్లో సంప్రదించారు. ఏం చేసుకుంటారో చేసుకోమని ఏజెంట్ బెదిరిస్తున్నాడని మృతుడి భార్య నాగమణి తెలిపింది.

అకౌంట్ నుంచి నగదు మాయం

ఖలీల్‌వాడి: నగరంలోని నెహ్రూ నగర్‌కు చెందిన రాందాస్ తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.5వేలు డెబిట్ అయినట్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపారు. రాందాస్ ఈనెల 18న అలీసాగర్ నుంచి నెహ్రూనగర్‌కి బైక్‌పై వస్తుండగా, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫోన్ పౌచ్‌లో బ్యాంక్ ఏటీఎం కార్డు, పిన్ వివరాలు ఉంచుకున్నాడు. దీంతో వెంటనే బ్యాంకుకు వెళ్లి చెక్ చేయగా తన అకౌంట్ నుంచి రూ.5 వేలు డెబిట్ అయినట్లు తెలిసింది. ఈమేరకు అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫోన్ పౌచ్‌లో ఎటువంటి కార్డులు, పిన్ నెంబర్లు రాసి పెట్టుకోకూడదని ఎస్సై సూచించారు.

పాతికేళ్లకు కలిసిన స్నేహితులు



భిక్కనూరులో సమావేశమైన సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

భిక్కనూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో 1998–99లో ఏడో తరగతి చదివిన విద్యార్థులు, పాతికేళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోటుకు చేరారు. మంగళవారం ఆ పాఠశాలలోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి విద్యార్థులందరూ హాజరై, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల పూర్వ ప్రధానాచార్యురాలు తక్కళ్ల భారతి మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహం కల్మశం లేనిదని పేర్కొన్నారు. తమకు చదువు చెప్పిన గురువులను పాతికేళ్ల దాటిన ఇంకా గుర్తుపెట్టుకుని సమ్మేళనానికి ఆహ్వానించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గంగెళ్లి వీర ప్రసాద్ కేవలం సమ్మేళనం కోసమే ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 18మంది విద్యార్థులకు 15మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆనాటి గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించి వారి ఆశీస్సులు పొందారు.

చాలా సంతోషంగా ఉంది..



సరస్వతి శిశుమందిర్‌లో 1998–99లో ఏడో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురించి సమాచారం అందడంతో నేను సింగపూర్ నుంచి వచ్చాను. నాకు సెలవులు లేకున్నా.. నా ఉన్నత ఉద్యోగికి సమ్మేళనం గురించి వివరించగానే నాలుగు రోజులు సెలవు ఇచ్చాడు. కేవలం చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడానికి నన్ను తీర్చిదిద్దిన ఆనాటి ఆచార్యులను, మాతాజీలను కలుసుకునేందుకే ఇక్కడికి వచ్చాను. అందరిని కలిసాను. చాల సంతోషం కలిగింది. ఈ రోజు తిరిగి సింగపూర్ వెళ్లిపోతున్నాను.

–గంగెళ్లి వీరప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సింగపూర్

చిన్నపాటి వర్షాలకే జలమయం



రెంజర్లలోని ఒకటవ వార్డులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



నాల్గవ వార్డులో..



ఇళ్ల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న ఒకటవ, నాల్గవ వార్డుల గల్లీలు తొలకరి వానలకే జలమయమయ్యాయి. బైపాస్ రోడ్డు పక్కనే లక్ష్మి కాలువ మైనర్ కాలువ ఉంటుంది. ఆ కాలువ కట్టపైనే బైపాస్ రోడ్డు వేశారు. ఆ రోడ్డు పక్కన నిర్మించిన మురికి కాలువ సరైన కొలతలతో నిర్మించలేక, ఉన్న కాలువలో పూడిక తొలిగించకపోవడంతో వర్షం కురిస్తే చాలు గల్లీలు జలమయం అవుతున్నాయి. ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సమస్యను పాలకులకు, అధికారులకు మొర పెట్టుకుంటున్న పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధుల్లో నీరు నిల్వ ఉండకుండ చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

మాచారెడ్డి(కామారెడ్డి): మండలంలోని లక్ష్మీరావులపల్లి మాజీ సర్పంచ్ అంకం సిద్ధవ్వను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం దుర్భాషలాడాడు. తన వ్యవసాయ మోటార్‌కు సంబంధించిన కనెక్షన్‌ను తొలగించిన సదరు వ్యక్తిని ప్రశ్నించినందుకు, తనను తిడుతూ చంపేస్తానని బెదిరించాడని బాధితురాలు వాపోయింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించింది.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: నగరంలో పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మంగళవారం 191 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేశారు. 8నుంచి కళాశాలల ఎంపిక ప్రారంభం కానుంది.

రెండు ఆలయాల్లో చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి (శివాలయం), యానంపల్లి(పెద్దమ్మ ఆలయం)లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని ఆభరణాలు, గంటలు, హారతి ప్లేట్లు అపహరించినట్లు స్థానికులు తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు ఆలయాలకు వచ్చి విచారణ చేపట్టి, కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

విద్యార్థినికి పాముకాటు

రుద్రూర్: పోతంగల్ మండలంలోని జల్లాపల్లిఫారం ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థిని నందిని పాముకాటుకు గురైంది. సోమవారం మధ్యాహ్నం తరగతి గది కిటికీలో నుంచి పుస్తకం బయట పడటంతో, నందిని పుస్తకం కోసం బయటకు వెళ్లింది. పుస్తకం తీసుకుంటున్న సమయంలో పాము కరవడంతో, ఈవిషయాన్ని విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం దృష్టికి తెచ్చారు. వెంటనే బాధిత విద్యార్థినికి కోటగిరిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

నస్రుల్లాబాద్(బీర్కూర్): భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బీర్కూర్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మేత్రి మధు (34)కు భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. గత నెలరోజులుగా పుట్టింటికి వెళ్లిన భార్య, కాపురానికి రావడం లేదని మధు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మనస్తాపం చెంది, సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకుతాడుతో ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని సోమర్యాగడితండాలో మంగళవారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. తండాలోని అజ్మీరా గోవింద్‌కు చెందిన పాడి గేదె మేత మేస్తుండగా పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి మృతి చెందినట్లు వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

కల్లుదుకాణంపై దాడి: ఒకరికి గాయాలు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని కల్లు దుకాణంపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి కల్లు సీసాలను ధ్వంసం చేయగా, ఒకరిని గాయపరిచినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన రామాయంపేట తిరుపతిగౌడ్ కల్లు మాములను పట్టుకున్నాడు. ఐదవ కల్లుదుకాణంను పాలంపల్లి సత్యాగౌడ్‌ను, నాలుగవ కల్లుదుకాణంను జంగంపల్లి గ్రామానికి చెందిన మీసాల గంగాధర్‌గౌడ్‌ను కల్లు విక్రయించేందుకు నియమించుకున్నాడు. గంగాధర్‌గౌడ్ కల్లు విక్రయించే పని ముగిసేవరకు రూ.ఒక లక్ష 68వేలను వాడుకున్నాడు. అందులో అతని వేతనం రూ.ఒక లక్ష ఆరు వేలు పోగా, మిగతా రూ.62వేలు తిరుపతిగౌడ్‌కు బకాయిపడ్డాడు. ఈ విషయమై తిరుపతిగౌడ్ తన బాకీ చెల్లించమని పలుమార్లు అడగడంతో, గంగాధర్‌గౌడ్ మంగళవారం కామారెడ్డికి చెందిన తన బావమరిది న్యాడెం శ్రీకాంత్‌గౌడ్‌ను వెంటబెట్టుకుని కల్లుడిపోలోకి ప్రవేశించి 40కల్లు పెట్టెల కల్లును పారబోసి సీసాలను ధ్వంసంచేసి అక్కడ పనిచేస్తున్న సత్యాగౌడ్‌ను గాయపరిచాడు. దీంతో బాధితుడు గంగాధర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్‌పై ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: ఓ యువకుడిపై కక్ష పెంచుకొని హతమార్చిన కేసులో ఇద్దరికి జీవితఖైదు విధిస్తూ మంగళవారం జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన ఫరీద్, షేక్ జుబేర్‌లు సారంగపూర్‌లోని ఇజాజ్ బీరువాల కంపెనీలో కార్మికులుగా పనిచేసేవారు. జుబేర్ తనను అవమానించేవాడని, సెల్‌ఫోన్ దొంగలించాడని ప్రచారం చేశారని ఫరీద్ కక్ష పెంచుకున్నాడు. ఫరీద్ 28 జులై, 2019న ఫోన్ చేసి జుబేర్‌ను పిలిపించుకొని ధర్మపురిహిల్స్ శివారులోని గుట్టపైకి తీసుకువెళ్లారు. గుట్టపై జుబేర్ సెల్‌ఫోన్ చూస్తుండగా ఫరీద్, వరుసకు తమ్ముడైన సులేమాన్ రాడ్‌తో కొట్టాడు. తలపై బండరాయివేసి హత్య చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. షేక్ ఫరీద్, సులేమాన్‌ఖాన్‌లపై హత్య అభియోగం రుజువు కావడంతో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. హతుడు జుబేర్ 18 సంవత్సరాలు కాగా, ముద్దాయిలు ఇద్దరు 19, 20ఏళ్ల వారు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరికి గాయాలు

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఒకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం డొంకల్ గ్రామానికి చెందిన నల్లవెల్లి రాజన్న గత నెల 27న బైక్‌పై హొన్నాజీపేట్ గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు ఇతడి బైక్‌ను ఢీకొని, ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ రాజన్న, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారుతో పాటు నిర్లక్ష్యంగా కారు నడిపిన డ్రైవర్‌ను పట్టుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి



శ్రీను మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలోగల చెరువు కుంటలో చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బండ శ్రీను(30) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం ఆంధ్ర నుంచి గ్రామానికి వలస వచ్చి మేస్త్రీ పని చేసుకుంటు జీవనాన్ని సాగిస్తున్నాడు. మంగళవారం గ్రామ శివారులోగల కుంటలో చేపలు పట్టడానికి వెళ్లిచ కాలుజారి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈత రాకపోవడంతోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య సునీత ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు.

స్కూల్‌కు వెళ్లిన విద్యార్థి అదృశ్యం



ప్రవీణ్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): స్కూల్‌కు వెళ్లి విద్యార్థి అదృశ్యమైన ఘటన రామారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. రామారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. స్కూల్ తండాకు చెందిన పిసావత్ ప్రవీణ్(14) అనే విద్యార్థి ఈనెల 3న స్కూల్ తండాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ప్రవీణ్ తండ్రి సేవ్య స్కూల్‌కు వెళ్లి ఆరా తీయగా, ప్రవీణ్ స్కూల్ నుంచి వెళ్లిపోయినట్లుగా ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ప్రవీణ్ తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని బాలుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.